క్లుప్తంగా

బీసీలకు 56శాతం సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సతీశ్

సుల్తానాబాద్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 56శాతం టిక్కెట్లు కేటాయించిన పార్టీకే బీసీల మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సబ్బు సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 56శాతం ఎమ్మెల్యే టికెట్స్ ఇవ్వాలని, బీసీలకు విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయ రంగాలలో జనాభా ప్రకారం వాటా ఇవ్వకపోవడంతో బీసీలు వెనుకబడిపోయారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సదయ్య, తిరుపతి, సందీప్, పొన్నాల లక్ష్మణ్, చాట్ల రవి, అనిల్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు

12 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. సుల్తానాబాద్‌లో 12 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు. వాటిని తమ కార్యాలయం ఆవరణలో ఉంచామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎలిగేడులో ఎల్లమ్మ బోనాలు

ఎలిగేడు: మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఏగోలపు నాగరాజు, కార్యవర్గ సభ్యులు బుర్ర రాజు, అడ్డగుంట రాములు, పురుషోత్తం అజయ్, ఏగోలపు శ్రీనివాస్, అడ్డగుంట ఉమాశంకర్, కెక్కర్ల చంద్రయ్య, అడ్డగుంట ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై ఆర్జేడీకి ఫిర్యాదు

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాలకు అనుమతి లేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోరె గణేశ్, రీజినల్ జాయింట్ డైరెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా మండల విద్యాధికారి, జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో సమాచారం సేకరించామని, ఇందులో సదరు పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతి పొందలేదని తెలిసిందని పేర్కొన్నారు. ఒకే భవనంలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించిన సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో గ్రామ దేవతలైన భూలక్ష్మి, శ్రీలక్ష్మి విగ్రహాలతో పాటు, బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేద పండితులు మంగళవారం హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు శ్రీనివాసశర్మ, దేవరాజు, రంజిత్‌శర్మ, దీక్షిత్ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పనునూటి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, గాండ్ల చెంద్రయ్య, కృష్ణారెడ్డి, నల్ల కనకరాజు, జంగిలి లచ్చయ్య, లక్ష్మీనారాయణ, ఈదుల లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, కొమ్మ రాజేశం, గొడిసెల నర్సయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్, నాంసానిపల్లె, గోపరపల్లె, ఓదెల గ్రామాల్లో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు.

తొలకరి కోసం ఎదురుచూపులు

- పత్తి విత్తనాలు పెట్టేందుకు దుక్కులు సిద్ధం
- ఇప్పటికే ఆలస్యమైందంటున్న అన్నదాతలు
- విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



పెద్దాపూర్‌లో పత్తి విత్తనాలు పెట్టేందుకు చేనును సిద్ధం చేసిన రైతు

జూలపల్లి: పంటలు సాగు చేసేందుకు, విత్తనాలు పెట్టేందుకు సీజన్ ప్రారంభమైంది. రోహిణి కార్తెలోనే దుక్కులు సిద్ధం చేసి తొలకరి కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఈసారి పత్తి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పత్తికి మద్దు ధర గణనీయంగా పెరగడంతో సాగు కూడా అదేస్థాయిలో పెరుగుతోంది.

5200 ఎకరాల్లో పత్తిసాగు..

మండలంలో వరిసాగు తర్వాత అధిక మొత్తంలో సాగు చేసేది పత్తి పంటనే. మండలం మొత్తంగా 5200 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత మొక్కజొన్న సాగుకు ఆసక్తి పెరుగుతోంది. ఇందుకు ఈ ప్రాంత నేలలు నల్లరేగడితో కూడుకున్నవి కావడం పత్తి సాగుకు అన్నిరకాలుగా అనువుగా ఉండడంతో రైతులు పత్తి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

పంటల సాగులో నాలుగేళ్లుగా పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీనిక అనుగుణంగా పత్తి రేట్లు కూడా పెరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం భూమి దున్నేందుకు ఎకరాకు రూ.3వేలు ఉండగా ప్రస్తుతం రూ.5వేలకు పెరిగింది. విత్తనాలు, కూలీల రేట్లు, కాంప్లెక్సు మందు బస్తాల రేట్లు, పొటాష్ రేట్లు భారీగా పెరిగాయి. తమ పరిస్థితి మరింత దారుణంగా ఉందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపులు



దుక్కి దున్నించి ఇరవై రోజులు అవుతోంది. విత్తనాలు తెచ్చి పెట్టుకున్నాం. వర్షం పడితే పత్తి విత్తనాలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం.

– నందాల మల్లేశం, రైతు, కుమ్మరికుంట

కౌలు రైతులను పట్టించుకోవాలి



పదేళ్లుగా భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నాం. నాలుగేళ్లుగా పత్తి పంటకు పెట్టుబడి పెరిగింది. కౌలు రేట్లు పెరిగాయి. కౌలు, పెట్టుబడి పోగా లాభాలు ఏమంతగా వస్తలేవు. ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవాలి. – మల్లెత్తుల మల్లేశం, కౌలు రైతు, జూలపల్లి

విత్తన ఎంపికలో జాగ్రత్త



నాణ్యమైన విత్తన శుద్ధి చేసిన ప్రముఖ గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలను తీసుకోవాలి. విత్తన ప్యాకింగ్, బ్యాచ్ నెంబర్, బిల్లును రైతులు దగ్గర పెట్టుకోవాలి. పంటలో నాణ్యత లోపిస్తే వెంటనే కంపెనీ పరిహారం చెల్లించే అవకాశం ఉంది.

– ప్రత్యూష, మండల వ్యవసాయాధికారి, జూలపల్లి

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు. పూజారులు గూడ రమేశ్‌శర్మ, లక్ష్మణ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాటేటి గట్టయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, తిరుపతిరెడ్డి, సర్వర్, సర్వేష్, తుమ్మ రాజ్‌కుమార్, మియాపురం శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎడవెల్లి రాంరెడ్డి, నగునూరి అశోక్‌కుమార్, రైస్‌మిల్లర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాడూరి ప్రసాద్, మొలుగూరి అంజయ్య, కౌన్సిలర్ తిరుపతి, పట్టణ యూత్ అధ్యక్షుడు వహీద్, రాజోజుల శివ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో అప్పులు తప్ప.. అభివృద్ధి శూన్యం అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు అరోపించారు. మండలంలోని నారాయణరావుపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కాంగ్రెస్ పథకాలను, హామీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని అనుకుంటే నిరాశే మిగలడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి శూన్యంగా మారిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు సొంతింటి కల, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో నిర్వహించే పల్లె ప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బాలాజీరావు కోరారు. సుల్తానాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పల్లెప్రగతి దినోత్సవాన్ని ఓ పండుగ వాతావారణం నెలకొనేలా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు దివ్యాంగులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల సభలో దివ్యాంగులకు పింఛన్ పెంచుతున్నట్లు ప్రకటించినందున హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ మండల అధ్యక్షుడు ఎనగంటి గంగయ్య, గౌరవ అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం, నాయకులు పుసుపునూటి స్వామి, చెన్నెళ్లి రాజేశం, ఎడపాక లచ్చయ్య, దారవేని అంజయ్య, మోతె కనుకయ్య, రాజేశం, కందుకూరి చారి, రామగిరి మల్లేశం, లింగయ్య పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజేందర్

కమాన్‌పూర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ కోరారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఒక మార్గదర్శకంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. పార్టీలో కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు జంగపెల్లి అజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు చంద్రపట్ల సునీల్‌రెడ్డి, మట్ట శంకర్, దండె లక్ష్మీనారాయణ, మచ్చగిరి రాము, మల్లారపు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు స్థలం ఇప్పించండి



వినతిపత్రం ఇస్తున్న అధ్యక్షుడు సూర్య

సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని యాదవ్‌నగర్‌లో ప్రభుత్వ భూమిలో గోశాలకు స్థలం ఇప్పించాలని శ్రీధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్ అధ్యక్షుడు బండారి సూర్య ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మంగళవారం సుల్తానాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. స్థలం కేటాయించేలా రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తాత్కాలిక షెడ్‌లో నిర్వహిస్తున్న శ్రీధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్‌కు శాశ్వత స్థలం ఉంటే గోశాలను సందర్శించవచ్చని, అన్ని విధాలా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆయనకు వివరించారు. ప్రధాన కార్యదర్శి నూక రామదాసు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ జీపు జాతకు రండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంథని: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే జీపు జాతకు తరలిరావాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వనజారాణి కోరారు. కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం మంథనిలో ఆవిష్కరించారు. జిల్లా కేంద్రానికి చేరుకునే జీపు జాతలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పాల్గొనాలన్నారు. కృష్ణకుమారి, సుగుణ, భాగ్య, రజిత, పద్మ, భాగ్యలక్ష్మి, సీఐటీయూ నాయకుడు బూడిద గణేశ్ ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



కాల్వశ్రీరాంపూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం నూతన బుక్స్ సరఫరా చేసిందని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య తెలిపారు. తాము ఇచ్చిన ఇండెంట్ ప్రకారం హెచ్‌ఎంలు సకాలంలో పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లాలని ఎంఈవో సూచించారు.

ఓదెలలో..

ఓదెల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంఈవో ఆరెపల్లి రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మండలంలోని 22 ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 హైస్కూళ్లకు, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో వెల్లడించారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలతో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మంగళవారం పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయి. యూనిఫాం పూర్తిస్థాయిలో రాలేదు. ప్రస్తుతం వచ్చిన బుక్స్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళా ఉద్యమకారులను మరిచిన కేసీఆర్

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన మహిళలకు సీఎం కేసీఆర్ సముచిత ప్రాధాన్యం ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీమాన్, బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. పెద్దబొంకూర్‌లో ఉపాధి కూలీల సమక్షంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా దివస్ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మల్లయ్య, సుభాష్‌రావు, కుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం సుల్తానాబాద్‌లో 2000 రోజులకుపైగా రిలే నిరాహార దీక్ష చేసినట్లు గుర్తు చేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని, పార్టీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ముత్యం రమేశ్‌గౌడ్ పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేంచందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, శ్రీనివాస్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం

✦ కాంగ్రెస్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శిగా రషీద్

రామగుండం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన మహ్మద్ రషీద్‌ను కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం అధ్యక్షుడు బొంతల రాజేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. రషీద్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన మక్కాన్‌సింగ్‌ఠాకూర్, హర్కర వేణుగోపాల్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

✦ రామగుండం కోఆర్డినేటర్‌గా రాజేశ్వర్

గోదావరిఖని: కాంగ్రెస్ రామగుండం నియోజకవర్గ ఆన్‌లైన్ క్విజ్ కోఆర్డినేటర్‌గా నిర్మల్‌కు చెందిన సీనియర్ నాయకుడు అంబటి రాజేశ్వర్‌ను నియమించారు. జాతీయ స్థాయిలో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ ప్రతిష్ఠాత్మంగా నిర్వహించడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ కోఆర్డినేటర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ తెలిపారు.

✦ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా హరీశ్

జ్యోతినగర్: జనసేన రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మూల హరీశ్‌గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, రామ్ తల్లూరి, రాజలింగం, తదితరులకు హరీశ్‌గౌడ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించాలి

రామగుండం: పట్టణంలోని 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఏరియా శివాజీనగర్ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించాలని కోరుతూ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ట్రాన్స్‌కో ఏఈ బేతి దామోదర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ శివాజీనగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ తరచూ సాంకేతిక లోపంతో మొరాయిస్తోందని, రానున్న వర్షాకాలం సీజన్‌లో మరింత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున సమస్య పరిష్కరించాలని కోరారు.

ఆమె నేత్రాలు సజీవం



లక్ష్మి (ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన నూతి లక్ష్మి(65) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందింది. తల్లిని కోల్పోయిన దుఃఖంలోనూ మృతురాలి కుమారుడు తిరుపతి ఆమె నేత్రాలను దానం చేయడానికి కుటుంబసభ్యులను ఒప్పించారు. మంగళవారం సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి బేణిగోపాల్ త్రివేది ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా నేత్రాలను సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. నేత్రదాత భర్త బొందయ్య, కుమారులు–కోడళ్లు తిరుపతి–సత్యవతి, ప్రేమ్‌చంద్–జ్యోతి, ప్రవీణ్‌కుమార్–మౌనికలను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు అభినందించారు.

ఘనంగా బోనాల జాతర



బోనాలతో మహిళలు

మంథని: ముత్తారం మండలం పోతారంలో గ్రామ దేవత పోచమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారి కొలుపులో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, సర్పంచ్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నేడు పంచాయతీ భవనం ప్రారంభం

జూలపల్లి: మండలంలోని చీమలపేటలో పూర్తయిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బుధవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించేందుకు ఆర్‌జీఎస్‌ఏ పథకంలో మంజూరైన రూ.20లక్షలతో నిర్మించిన భవనంలో అన్ని వసతులు కల్పించారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ హాజరుకానున్నట్లు సర్పంచ్ తొంటి పద్మ బుచ్చన్న తెలిపారు.

✦ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలోని చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు మిట్టపల్లి వసంత, నాయకుడు వెంకటేశం కోరారు. జేసీబీ ట్రాక్టర్లతో మట్టి అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలోని హుస్సేన్‌మియా వాగు నుంచి ఇసుక కూడా రాత్రివేళల్లో ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

✦ కేవీకేలో ఉచితంగా భూసార పరీక్ష

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఉచితంగా రైతులకు భూసార పరీక్షలు చేయనున్నట్లు కేవీకే మృత్తిక శాస్త్రవేత్త పిల్లి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మట్టి నమూనాలను తీసుకొచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

✦ నేడు రక్తదాన శిబిరం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో ఎన్టీపీసీ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పెద్దపల్లి రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గూళ్ల అంజన్‌కుమార్ తెలిపారు.

✦ పాఠశాల కరస్పాండెంట్‌పై దాడి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ఇండియా మిషన్ పాఠశాలను ఆక్రమించుకోవాలనే కుట్రతో మంగళవారం కరస్పాండెంట్ ధనుంజయరెడ్డిపై దాడికి పాల్పడ్డారని పాఠశాల అడ్‌హక్ కమిటీ సభ్యులు మోసె, కుమార్, రవి, జాన్, బర్నబ, మోజెస్, సామ్యేల్ తెలిపారు. దాడికి పాల్పడ్డ అంకరి కుమార్, మనోహర్, సుదర్శన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

✦ ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను మరో ఆర్నెళ్లు పొడిగిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న కమిటీలు నవంబర్ వరకు కొనసాగనున్నారు. కమిటీ చైర్మన్లుగా చాలామంది అధికార పార్టీకి చెందిన వారే ఉండడంతో గడువు పొడిగించుకున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

✦ విద్యుత్ మోటార్ల స్టార్టర్లు చోరీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ రామగిరి ఖిల్లా శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల స్టార్టర్లను రెండురోజుల క్రితం దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు మంగళవారం తెలిపారు. 10మందికి చెందిన స్టార్టర్లు చోరీకి గురయ్యాయని పేర్కొన్నారు.

వెరిఫికేషన్‌లో బిజీబిజీ



రికార్డులు పరిశీలిస్తున్న వీఆర్‌ఏలు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పలు బీసీ కులాలకు రూ.లక్ష రుణం అందిస్తామని చెప్పడంతో పలువురు కులం, నివాసం కోసం దరఖాస్తులు అందజేశారు. మీ సేవ ద్వారా నమోదు చేసిన సర్టిఫికెట్లను తహసీల్దార్ కార్యాలయంలో చేరవేశారు. వాటిని గ్రామాల వారీగా వీఆర్‌ఏలకు అందజేశారు. వాటిని కులాల వారీగా విభజించి గ్రామాల్లో నివసిస్తున్న వారితోపాటు సరైన కులం అని నిర్ధారణ చేస్తేనే కులం సర్టిఫికెట్‌ను రెవెన్యూ అధికారులు సంతకాలు పూర్తి చేస్తున్నారు. కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు రావడంతో సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. వాటితో పాటు ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ సైతం చూడాలని ఉద్యోగులు సూచించడంతో రెండు పనులు చేస్తున్నారు.